రూ.13.70 లక్షలతో సీసీ రోడ్డు పనులు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ నందిముస్లాయిగూడ మారుతినగర్‌లో కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ నూతన సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఆయా సంబంధిత అధికారులతో చర్చించి పనులు త్వరగా మంజూరు చేయించినా కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు రాక పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. బస్తీల్లో ఎలాంటి సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకొస్తే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ నాయకులు, అర్బన్ జిల్లా కార్యదర్శి కొమురయ్య, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజు పహిల్వాన్, బిట్యూరి సిద్దేశ్వర్, వెంకట్ రెడ్డి, విజయస్వామి, గణేష్, వెంకటేష్, వాసుదేవ రెడ్డి, జితేందర్‌సింగ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఆరు లక్షల ఓటర్లకు చేరువలో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం ఓటర్ల తుది జాబితాను గురువారం అధికారులు ప్రకటించారు. నియోజకవర్గంలో మొత్తం 5,99,585 మంది ఓటర్లుగా నమోదయ్యాయి. వీరిలో 3,10,863 మంది పురుషులు కాగా.. 2,88,684 మంది మహిళా ఓటర్లు, 38 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. గతంలో కంటే భారీస్థాయిలో ఓటర్లు పెరిగారు. గురువారం నుంచి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటరులిస్టును ప్రదర్శిస్తున్నారు. స్థానిక ప్రాంతాలకు చెందిన ఓటర్లు తమ పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లి తమ పేరును సరిచూసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

నూతన సీఐకి శుభాకాంక్షలు



మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు నూతన సీఐగా పదవీ బాధ్యతలు తీసుకున్న హరికృష్ణారెడ్డిని మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ నాయకులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, తమ వంతు సహకారం అందిస్తామన్నారు. మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు, బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షురాలు లక్ష్మీశ్రీ, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ మైనార్టీ అధ్యక్షుడు బషీర్ తదితరులున్నారు.

నియామకం



రాజేంద్రనగర్: బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన గుర్రంపల్లి శ్యామల్‌రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ గుర్రంపల్లి శ్యామల్‌రాజ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన శయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ.. ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు ప్రతాప్‌సింగ్, రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్‌తో పాటు పార్టీ ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తుది ఓటరు జాబితా



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన తుది ఓటర్ల జాబితాను పోలింగ్‌స్టేషన్లలో గురువారం నుంచి ప్రదర్శించారు. ఉదయం బీఎల్‌ఓలు ఆయా పోలింగ్‌స్టేషన్‌లో ఓటర్ల లిస్టును ఏర్పాటు చేశారు. ఓటర్లు తుది జాబితాలో తమ పేర్లను సరిచూసుకోవాలని ఉప కమిషనర్ రవికుమార్ సూచించారు. తప్పొప్పులు ఉన్నా.. దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఓటరులిస్టులో పేర్లు లేని వారు నమోదు చేసుకోవాలని కోరారు. మృతి చెందిన వారి పేర్లు ఓటర్ లిస్టులో ఉంటే కుటుంబసభ్యులు బీఎల్‌ఓలకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

మహవీర్ కళాశాలలో అవగాహన సదస్సు



అత్తాపూర్: బండ్లగూడలోని మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ట్రోమా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సంరెడ్డి సురేందర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్, మ్యాగ్జిలో ఫెసియల్ సర్జన్ డాక్టర్ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డుపై ప్రమాదాలు జరిగినప్పుడు అపస్మారక స్థితిలోకి వెళ్లిన రోగికి ప్రథమ చికిత్స అనంతరం తక్కువ సమయంలో చేర్చడం ద్వారా ప్రాణాలను కాపాడొచ్చని వివరించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ పాటిల్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో పీసీసీ నాయకుడి భేటీ



మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌ను గురువారం రాష్ట్ర పీసీసీ సీనియర్ నాయకులు సానెం శ్రీనివాస్‌గౌడ్ అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సమస్యలపై ఆయనతో చర్చించానని చెప్పారు. త్వరలో నియోజకవర్గానికి వస్తానని హామీ ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు.

క్షణ క్షణం.. భయం.. భయం !

పంట పొలాల్లో ఎప్పుడు కూలుతాయో తెలియని కరెంటు స్తంభాలు.. చేతికి తగిలేలా కిందకు వేలాడుతున్న తీగలు.. ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు, గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై అధికారులు దృష్టి సారించడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనేకసార్లు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మల్కారంలో రైతు పొలంలో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం

- ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు, స్తంభాలు
- ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు కరువు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- భయాందోళనలో రైతులు



రషీద్‌గూడ వద్ద నేలను తాకుతున్న ట్రాన్స్‌ఫార్మర్ ఇలా..

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో కరెంటు స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. పొలాల్లో రైతులు సాగు చేసుకోవడానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పనులు చేసుకుంటున్నారు. మరికొంత మంది సాగును వదిలేశారు. కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో పశువులు, జీవాలు మృత్యువాత పడుతున్నాయి.

- మల్కారం గ్రామంలోని ఈసీవాగు పరివాహక ప్రాంతం సమీపంలో కరెంటు స్తంభాలు ఓ పక్కకు ఒరిగిపోయాయి. ఎప్పుడు కూలుతాయోనని భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ తీగలు సైతం కిందకు వేలాడుతున్నాయి.
- రషీద్‌గూడ గ్రామ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ నేలకు ఆనుకుని ప్రమాదకరంగా మారింది. విద్యుత్ షాక్ తగిలి పశువులు, జీవాలు మృత్యువాత పడ్డాయి. సమీపంలోని పొలాల్లో విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి, తీగలు కిందకు వేలాడుతున్నాయి.
- పిల్లోనిగూడ గ్రామంలో ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో స్థానికులు భయాందోళనకు గురౌతున్నారు. విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన 11 కేవీ విద్యుత్ తీగలు ఇళ్ల సమీపం నుంచి ఉన్నాయి.
- ప్రభుత్వం నిధులు విడుదల చేసినా.. అధికారులు అనాలోచిత నిర్ణయాలతో పనులకు ఆటంకం కలుగుతుందని మాజీ సర్పంచ్ బుచ్చమ్మ ఆరోపిస్తున్నారు.
- చిన్నగోల్కొండ శివారులో చర్లగూడ వెళ్లే మార్గం పక్కన ఉన్న పొలాల్లో విద్యుత్ తీగలు, స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి.
- ఆయా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు.
- పేద ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని పెద్దల సమస్యలను మాత్రం సకాలంలో పూర్తి చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు నెలల నుంచి చెబుతున్నాను..



నా పొలంలో విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి ఎప్పుడు కూలుతాయో తెలియడం లేదు. వాటిని సరిచేయాలని ఆరు నెలల నుంచి అధికారులకు చెబుతున్నా.. స్పందించడంలేదు. ఇప్పుడు సాగు చేయడం కూడా మానేశాను.

– అయినాల వెంకట్‌రెడ్డి, రైతు, మల్కారం

'అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్'

విద్యార్థులకు వందశాతం ఉద్యోగాలు



మేనేజ్‌లో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)లో అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసిన విద్యార్థులకు 100 శాతం ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని పీజీడీఎం 27వ బ్యాచ్ విద్యార్థులకు గురువారం 65 మందికి వివిధ కంపెనీలు మేనేజ్‌కు వచ్చి వారికి నియమకపత్రాలు అందజేశారన్నారు. ఇది మంచి పరిణామమని ఈ మైలురాయిని సాధించడం సమిష్టిగా ప్రతి ఒక్కరూ కృషి చేయడం ద్వారానే సాధ్యమైందని మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి. చంద్రశేఖరన్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా నూరుశాతం ప్లేస్‌మెంట్ సాధిస్తూ.. అత్యుత్తమమైన రికార్డును మేనేజ్ సాధిస్తుందన్నారు. అత్యధికంగా 'గోద్రేజ్ అగ్రోవెట్ లిమిటెడ్' అత్యధికంగా రిక్రూట్ చేసిందని, దీంతో పాటు ఐటీసీ, ఈవై ఇండియా, బీఎస్ఎఫ్, కోరమాండల్, పీఐ ఇండస్ట్రీస్, ప్రసాద్ సీడ్స్, సీక్వోయా బయోస్కీ వంటి కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కలిప్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ కమిటీకి, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు సిబ్బందికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును పొందడంతో పాటు అన్ని ఎన్నికల్లో వినియోగించుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌హాల్ మార్క్ సిల్వనస్, నెక్నాంపూర్ గ్రామాల్లో ఆన్‌లైన్ ఓటుహక్కు పొందే కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధికులు బీజేపీకి వేసేందుకు సిద్ధంగా ఉన్నారని, అలాంటి వారికి స్థానికంగా ఓటుహక్కు లేదనే విషయాన్ని తెలుసుకుని కేంద్రాలను ఏర్పాటు చేసి చేర్పించామన్నారు. బీజేపీ మున్సిపాలిటీ ఓబీసీ అధ్యక్షుడు ఆనంద్ రావు, మున్సిపాలిటీ పార్టీ ఉపాధ్యక్షుడు వేణుకుమార్, నాయకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం



వట్టినాగులపల్లిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మణికొండ: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి కాంగ్రెస్ శ్రేణులు దహనం చేశారు. గురువారం గ్రామంలోని ప్రధాన రోడ్డుపై దిష్టి బొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు శిశుపాల్‌సింగ్, ఎం. ధర్మపురిలు మాట్లాడుతూ.. సభ్యత, సంస్కారం మరచి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడటం రాజకీయాల్లో తగదన్నారు. ఆయనపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు తారాసింగ్, శంకర్, అరుణ్‌కుమార్‌ముదిరాజ్, ఆర్. సురేష్, మల్లేష్, సాయి, శ్రీకాంత్, లక్ష్మణ్, రాము, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్స్ తొలగింపుతో స్వచ్ఛంగా..





అత్తాపూర్: ప్రజల సౌకర్యార్థం ప్రజల కనీస అవసరాల్లో భాగంగా టాయిలెట్లను నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ జనప్రియ ప్రాంతంలో టాయిలెట్లను ఏర్పాటు చేశారు. ఈ మూత్రశాల సమీపంలో ఎవరికి వారు ఇష్టానుసారంగా వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో స్థానికంగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన మూత్రశాలను తొలగిస్తే స్థానికంగా చెత్త వేయడం ఆపివేస్తారనే ఉద్దేశంతో స్థానికులు తొలగించారు. దీంతో ఆ ప్రాంతం ప్రశాంత వాతావరణంలో స్పష్టంగా కనిపిస్తోంది.

ట్రేడ్ లైసెన్స్ బెదిరింపులను నమ్మొద్దు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో కొందరు ట్రేడ్ లైసెన్స్‌లను ఇప్పిస్తామని, లేదంటే మీ షాపులను మూసివేయిస్తామని డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటివి నమ్మొద్దని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ తెలిపారు. ట్రేడ్ లైసెన్స్‌లు అవసరమైన వారు సీడీఎంఏ. సీజీజీ. జీటీవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకుంటే జారీ చేస్తామన్నారు. ఇతర సందేహాలు ఉంటే ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సంపత్ 9949157957ను సంప్రదించాలని కోరారు. బెదిరించిన వారిపై నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించామని స్పష్టం చేశారు.

వేతనాలు చెల్లించండి !

ఏజీవర్సిటీ: ప్రతి రోజు విధులు నిర్వహిస్తున్నా.. జీతాలు మాత్రం సమయానికి ఇవ్వడం లేదని రాష్ట్రంలో ఉద్యోగులందరికీ 1 న జీతాలొస్తే వెటర్నరీ నాన్ టీచింగ్ ఉద్యోగులకు జీతాలు లేవని రాష్ట్ర వెటర్నరీ నాన్ టీచింగ్ ఎంప్లాయి రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ షర్ఫుద్దీన్ అన్నారు. గురువారం పీ.వీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వేతనాల గురించి వీసీ,రిజిస్ట్రర్‌ని అడిగితే ఎలాంటి స్పందన లేదని మాకు అ పవర్ లేదని పై నుంచి రావాలని అంటున్నారని వాపోయారు. పెన్షన్లు వచ్చే వారికి కూడా రావడం లేదని కుటుంబాలు ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఏళ్ల గడుస్తున్నా.. జనరల్ ట్రాన్స్‌ఫర్స్ లేవని చాలా సమస్యలతో సతమతవుతున్నామన్నారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే విధులను బహిష్కరించి ధర్నాకు దిగాల్సి వస్తుందన్నారు. ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ఉపాధ్యక్షుడు అంజిలయ్య, అశోక్, కుమార్, పెంటయ్య, మైనుద్దీన్, శ్రీశైలం పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో స్థలం కాజేసేందుకు యత్నం

ఇద్దరు నిందితుల రిమాండ్
పరారీలో మరో నలుగురు

రాజేంద్రనగర్: అమెరికాలో ఉంటున్న వ్యక్తికి సంబంధించిన విలువైన స్థలాన్ని నకిలీ దస్తావేజులతో ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నించిన ఇద్దరిని రాజేంద్రనగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరికి సహకరించిన మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. శ్రీనివాస్‌రావు అమెరికాలో ఉంటున్నాడు. కాగా గతంలో రాజేంద్రనగర్ మండలం బుద్వేల్ సర్వే నంబర్ 88లో జన చైతన్య హౌసింగ్ సొసైటీ నుంచి 400ల గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. సొసైటీ 211 ప్లాట్‌ను శ్రీనివాస్‌కు కేటాయించింది. అప్పటి నుంచి శ్రీనివాస్ ఈ ప్లాట్‌ను తన స్వాధీనంలోకి తీసుకున్నాడు. గత నాలుగేళ్లుగా యజమాని వద్దకు రాలేదు. ఇదే అదునుగా భావించిన కుర్మగూడకు చెందిన సుదర్శన్ (64), పాతబస్తీ ఉప్పుగూడ హనుమాన్‌నగర్‌కు చెందిన కె.చంద్రశేఖర్ (48)తో పాటు మరో నలుగురు కలిసి శ్రీనివాస్ పేరిట ఆధార్‌కార్డు, ఇతర నకిలీ డాక్యుమెంట్లను సృష్టించారు. డెత్ సర్టిఫికెట్లు సైతం సృష్టించి మరో మహిళను సృష్టించారు. ఈ స్థలాన్ని ఇతరుల పేరుపై రిజిస్ట్రేషన్ చేసేందుకు రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చారు. సబ్ రిజిస్ట్రార్ అనుమానంతో రిజిస్ట్రేషన్‌ను ఆపి వేసి డాక్యుమెంట్‌లో శ్రీనివాస్ చిరునామాకు లేఖ రాశారు. దీంతో స్పందించిన శ్రీనివాస్ రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి పూర్తి దస్తావేజులను సమర్పించారు. సబ్ రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం సుదర్శన్, చంద్రశేఖర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సాయిబాబా కాలనీలో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. సకాలంలో పూర్తి చేయడం జరుగుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. దర్గా ఖలీజ్‌ఖాన్ నుంచి కిస్మత్‌పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిని హెచ్‌ఎండీఏ అధికారులు నిర్మిస్తున్నారు. కిస్మత్‌పూర్ సాయిబాబా కాలనీ సమీపంలో నిర్మిస్తున్న నాలా సరిగ్గా లేదని దాని వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం ఆయన పర్యటించి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రోడ్డు నాణ్యత, రోడ్డు భద్రత ప్రమాణాల్లో ఎలాంటి లోపం జరగకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ రాజ్‌కుమార్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర వెల్లడించారు. గురువారం కార్పొరేషన్ పరిధి 10వ డివిజన్‌లోని శివసాయినగర్, 9వ డివిజన్‌లోని ముదిరాజ్ సంఘం లైన్‌లో ఆయన పర్యటించారు. చెత్త సేకరణ కార్మికులు, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కిస్మత్‌పూర్ మెయిన్ రోడ్డుపై స్వీపింగ్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని సూచించారు. చెత్తను రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో వేయకూడదని పేర్కొన్నారు. ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు. ఎవరైనా చెత్తను రోడ్లపై పారవేస్తే వారికి జరిమానా విధిస్తామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. రోజూ రోడ్లను శుభ్రంగా ఊడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

'లా అండ్ ఆర్డర్' పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్‌స్టేషన్ సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా తాకినా.. మాట్లాడిన వారిపై షీ టీం దృష్టికి తీసుకు రావాలని మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ మధు అన్నారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ శ్రీగాయత్రి ఈ–టెక్నో పాఠశాల ఆధ్వర్యంలో యాజమాన్యం చైర్మన్ కొంపల్లి మధుసూదన్, డైరెక్టర్ సమీఉద్దీన్ సహకారంతో విద్యార్థులు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వానికి పోలీస్ స్టేషన్‌పై అవగాహన కల్పించారు. ఆడపిల్లలపై సమాజంలో అనేక దాడులు జరుగుతున్నాయని చిన్ననాటి నుంచే వారికి నేరాల పట్ల అవగాహన కల్పించాలని సీఐ మధు ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులపై అనుచిత ప్రవర్తన చేసినా.. బెదిరించినా దైర్యంగా వారిని ఎదుర్కొని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని చెప్పారు. నేరాలు చేసిన వ్యక్తులపై లా అండ్ ఆర్డర్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో విద్యార్థులకు వివరించారు. సమాజంలో జరిగే నేరాలపై విద్యార్థులకు ఏఎస్సై హసీనా అవగాహన కల్పించారు. హైస్కూల్ ఇన్‌చార్జ్ సంజయ్ తివారి, ప్రైమరి పాఠశాల ఇన్‌చార్జ్ వింధ్య తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృధా



పైపులైన్ ధ్వంసం కావడంతో రోడ్డుపై వృధాగా ఇలా..

రాజేంద్రనగర్: తాగునీటి పైపులైన్ ధ్వంసం కావడంతో 24 గంటలుగా తాగునీరు వృధాగా ఈసీలోకి కలుస్తుంది. అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయగా.. నామమాత్రంగా ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వెనుతిరిగారు. ఈ విషయంపై రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం.. బుద్వేల్ కిష్టమ్మగుట్ట ప్రాంతంలోని ప్రభుత్వ స్థలాన్ని గతంలో 20 ఏళ్ల క్రితం నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు స్వీకరించిన పలువురు ఈ స్థలం పూర్తిగా రాళ్లు, రప్పలు, గుట్టలుగా ఉండటంతో పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ స్థలం ధరలు లక్షల్లో పలుకుతుండటంతో నాడు పట్టాలు పొందిన వారు ఈ గుట్టల్లో చదును చేస్తూ.. నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ స్థలం నుంచి హిమాయత్‌సాగర్ నుంచి బుద్వేల్ రిజార్వాయర్‌కు తాగునీటిని అందించే పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ప్రొక్లెయినర్‌తో ఈ స్థలంలోని రాళ్లను చదును చేశారు. భారీ ప్రొక్లెయినర్ కారణంగా పైపులైన్ పగిలిపోయింది. దీంతో నీరంతా రోడ్లపై ప్రవహిస్తూ.. పక్కనే ఈసీలోకి ప్రవహించాయి. ప్రొక్లెయినర్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాత్రి నుంచి తాగునీరంతా వృధాగా పోతూనే ఉంది. గురువారం ఉదయం స్థానికులు జలమండలి 17వ సెక్షన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మరమ్మతులు వారే చేయిస్తారని అధికారులు తెలిపి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై జలమండలి ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.